క్లుప్తంగా

డీఈఓను కలిసిన ఏపీటీఎఫ్ నేతలు



నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీని ఏపీటీఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్, వెంకటేశ్వరరెడ్డి, ఆరిఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి విషయమై ఘర్షణ

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి మృతి చెందడంతో ఇంటి విషయమై ఆయన ఇద్దరు భార్యలు ఘర్షణ పడిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన ఆరిఫ్ మొదటి భార్యకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమెకు ఆయన విడాకులిచ్చి ఆయేషాను రెండో వివాహం చేసుకున్నారు. ఆమెకు ఇది వరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. గతేడాది ఆరిఫ్ మృతి చెందారు. ఆయన ఉంటున్న ఇంటి విషయమై ఇద్దరి భార్యల నడుమ వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయేషాపై మొదటి భార్య నసీమా, ఆమె కుమార్తె జాన్సీ, ముంతాజ్ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశం పంతులు విగ్రహానికి మంటలు



నెల్లూరు(క్రైమ్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి సోమవారం అర్ధరాత్రి మంటలు వ్యాపించాయి. విగ్రహానికి కప్పి ఉన్న ముసుగు కాలిపోయింది. సమాచారం అందుకున్న చిన్నబజార్ పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ఘటనకు సంబంధించిన బాధ్యుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారని సమాచారం. సదరు వ్యక్తికి మతిస్థిమితం లేదని తెలుస్తోంది.

గడ్డి మందు తాగిన యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు కె.విధిలేష్(24) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు మండలంలోని చౌకచెర్ల గ్రామానికి చెందిన విధిలేష్ స్థానికంగా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విధిలేష్ గ్రామంలో ఎక్కువగా అప్పులు చేశాడని తెలుసుకున్న తల్లిదండ్రులు అతనిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విధిలేష్ మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు విధిలేష్‌ను చికిత్సనిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ విధిలేష్ సోమవారం మృతిచెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

ఇందుకూరుపేట: నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికసాయంతో, స్థానిక నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 98వ గ్రిగ్స్ కోవూరు జోన్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీలత, కార్యదర్శి ఎం.పల్లవి, ఉపాధ్యాయిని ఉమాకిరణ్, హెచ్‌ఎం నాగేశ్వరరావు ఈ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దశరథరామిరెడ్డి, ముజీర్, శ్రీనివాసులు, సిరాజ్, కృష్ణమోహన్, రేణుక, బీవీ రమణయ్య, నరసయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కోవూరు: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోందని డీసీఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీఎస్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఆ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలోని విద్యార్థులకు అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయండి

నెల్లూరు సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. ఎన్నికలను మార్చి 13న నిర్వహించనున్నారని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, టీపీఓ ప్రసాద్‌రావు, టౌన్ ప్లానింగ్ డీసీపీ దశయ్య, తహసీల్దార్ నిర్మలానందబాబా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిత

హక్కులపై అవగాహన

నెల్లూరు (టౌన్): పౌరులకు కల్పించిన ప్రాథమిక, ఇతర హక్కులపై పొదలకూరు రోడ్డులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ మాట్లాడారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. అనంతరం అక్కడి భోజన, వసతులను పరిశీలించారు. సుజాత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (అర్బన్): ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై ఆర్బీఐ రూపొందించిన మూడు రకాల పోస్టర్లను కలెక్టర్ చక్రధర్‌బాబు తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొదుపు, ఆర్థిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ పోస్టర్లను రూపొందించారని చెప్పారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ జోగారావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాస్, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, నాబార్డు బీడీఎం రవిసింగ్, ఏపీజీబీ ఆర్‌ఎం శైలేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం, పడారుపల్లి, భక్తవత్సలనగర్, తదితర ప్రాంతాల్లో ఇందూ ధర్మ ప్రచారాన్ని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞానవేదిక – ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నెల్లూరు నగరాధ్యక్షుడు సురమౌళి మాట్లాడారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ప్రచారాన్ని చేపట్టామని వివరించారు. అనంతరం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను అందజేశారు. సమితి సభ్యులు నరసింహప్రసాద్, సోమశేఖర్, రమణయ్య, సునీల్, లీలావతి, పద్మజ, సుమలత, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాలంటైన్స్ డేకు కళారూపం



నెల్లూరు(బృందావనం): వాలంటైన్స్ డేను పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు పద్మారత్నం మామిడికాయపై చాకుతో కార్వింగ్ ఆర్ట్‌ను సోమవారం తీర్చిదిద్దారు. యువతికి యువకుడు పుష్పగుచ్ఛమిస్తున్న దృశ్యాన్ని నాలుగు సెంటీమీటర్ల పరిమాణంలో మామిడికాయపై తీర్చిదిద్దానని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని రామయ్యబడి ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలస్థానేశ్వరాలయ పరిసర ప్రాంతాలు, కోనేటిమిట్ట, బ్రాహ్మణవీధి, రాజావారివీధి, అలంకార్ సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన నగరానికి చెందిన క్రీడాకారుడ్ని అసోసియేషన్ నేతలు సోమవారం సత్కరించారు. శాంతినగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటారెడ్డి మాట్లాడారు. ఒడిశాలోని పూరిలో ఇటీవల నిర్వహించిన జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు తరఫున చిన్నారావు ఉత్తమ ప్రతిభను చూపారని కొనియాడారు. కార్యదర్శి కామేశ్వరి, కోచ్ సుకృత, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బంగారంతో ఉడాయించిన ఏజెంట్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బంగారంతో ఉడాయించిన ఏజెంట్‌ను సంతపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొగతోటకు చెందిన వరుణ్ మండపాలవీధిలో మోడరన్ జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నారు. పెద్దబజార్‌కు చెందిన రబ్బానీ దుకాణంలో ఏజెంట్‌గా పనిచేస్తున్నారు.
దుకాణంలోని 700 గ్రాముల బంగారంతో గత నెల 31న రబ్బానీ ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా నిందితుడిపై కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పొర్లుకట్ట వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.20 లక్షల విలువజేసే 457.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అజ్ఞాతంలోకి బంగారు వ్యాపారి

నెల్లూరు(క్రైమ్): ఓ బంగారు వ్యాపారి సహచర వ్యాపారులను నట్టేటా ముంచారు. కుటుంబంతో సహా రాత్రికి రాత్రే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్లకు క్యూ కడుతున్నారు. వివరాలు.. నగరానికి చెందిన కిరణ్ చిన్నబజార్‌లో బంగారు వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారావసరాల నిమిత్తం అప్పుడప్పుడూ సహచరుల వద్ద కిలోల్లో బంగారాన్ని తీసుకునేవారు. వ్యాపారాల్లో నష్టాలో మరే ఇతర కారణమో తెలియదు గానీ ఇటీవల ఆయన కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని సమాచారం. బంగారాన్ని ఇచ్చిన వ్యాపారులు ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్లకు క్యూ కడుతున్నారు. సంతపేట, నవాబుపేట పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే ఒకరిద్దరు బాధితులు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మొత్తంగా 20 కిలోలకుపైగా బంగారాన్ని తీసుకున్నారనే ప్రచారం వ్యాపార వర్గాల్లో జరుగుతోంది.

ముగ్గురి బైండోవర్

నెల్లూరు(క్రైమ్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పొదలకూరు రోడ్డు సెంటర్‌లో ఆదిత్య, మహేష్‌బాబు, రాజా వెంకటసిద్ధార్థను దర్గామిట్ట ఎస్సై సుబ్రహ్మణ్యం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని బైండోవర్ చేశారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): దోపిడీకి యత్నించిన కేసులో పరారీలో ఉన్న రౌడీషీటర్‌ను చిన్నబజార్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డులోని జేవీఆర్ కాలనీకి చెందిన అఖిల్ అలియాస్ చిన్నూ, లేక్‌వ్యూ కాలనీకి చెందిన హరికుమార్ అలియాస్ చింటూ, రాజీవ్‌గృహకల్పకు చెందిన నారాయణ, శ్రీనివాసులు అలియాస్ బాన, కోటమిట్టకు చెందిన యూనస్, మరో వ్యక్తి స్నేహితులు. వీరంతా ముఠాగా ఏర్పడి ఈ నెల తొమ్మిదో తేదీ తెల్లవారుజామున సండే మార్కెట్ వద్ద వచ్చిపోయే వ్యక్తులను కత్తులతో బెదిరించి దోపిడీలకు యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని అఖిల్, హరికుమార్, నారాయణ, యూనస్‌ను అరెస్ట్ చేశారు. శ్రీనివాసులు అలియాస్ బాన, మరో నిందితుడు పోలీసులను చూసి పరారయ్యారు. ఈ క్రమంలో శ్రీనివాసులును అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. నేరాలకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

చెస్ టోర్నీ విజేతగా సుమన్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి చెస్ టోర్నీ విజేతగా సుమన్ నిలిచారు. పార్థసారథినగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో జిల్లా చెస్ అసోసియేషన్, ఆర్‌ఎల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమన్, హేమల్‌వర్షన్ ఆరు రౌండ్లకు గానూ ఆరు పాయింట్లు సాధించి ఆధిపత్యం ప్రదర్శించారు. అయితే బుచ్ స్కోర్ ఆధారంగా సుమన్‌ను విజేతగా, హేమల్‌వర్షన్‌ను రన్నర్స్‌గా టోర్నీ చీఫ్ ఆర్బిటర్ రామ్‌లక్ష్మణ్ ప్రకటించారు. తర్వాతి స్థానాలను ప్రద్యుమ్నలక్ష్మి, సుమనీష్, హరీష్‌కుమార్ సాధించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సీనియర్ క్రీడాకారుడు వెంకటేశ్వరరావు, సిల్వర్ ఓక్స్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్, డిప్యూటీ ఆర్బిటర్స్ వెంకటరమణ, ప్రదీప్, వంశీకృష్ణ, సుగత్రా, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత మైన్స్ అధికారి ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): విశ్రాంత మైన్స్ అధికారి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మిలటరీ కాలనీలో విశ్రాంత మైన్స్ అధికారి జకర్యాకు నాలుగంతస్తుల భవనం ఉంది. గ్రౌండ్, మొదటి ఫ్లోర్లను ఆయన వాడుకుంటూ మిగిలిన వాటిని అద్దెకు ఇచ్చారు. ఆయన కుమార్తె హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తుండటంతో ఎక్కువగా అక్కడే ఉంటున్నారు. నెలకోసారి నెల్లూరొచ్చి వెళ్తుంటారు. ఇంటి గ్రౌండ్ ఫ్లోర్ తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన అద్దెకున్న వారు జకర్యాకు ఫోన్లో సమాచారం అందించారు. దీనిపై దర్గామిట్ట పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. తలుపులు.. బీరువాను పగలగొట్టి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. ఎస్పీ విజయారావు ఘటన స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన తీరును ఆరా తీశారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ పరిశీలించారు. బాధితులు నెల్లూరొచ్చాక పూర్తి వివరాలు తెలియనున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ టీవీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



వివరాలను సేకరిస్తున్న సీతారామయ్య

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

నెల్లూరు(సెంట్రల్): రైల్వే ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నెల్లూరులోని రైల్వే కార్మికుల యూనియన్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌లో దేశ వ్యాప్తంగా అన్ని కార్మికులతో ఈ నెల 20 చర్చలు జరపనున్నామని, అనంతరం 27న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నామని వివరించారు. కోటి సంతకాలతో రాష్ట్రపతికి వినతిపత్రాన్ని ఇవ్వనున్నామన్నారు. నాగేశ్వరరావు, శ్రీనివాసులు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.
భక్తులు విశేషంగా తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తొమ్మిదికి ధ్వజారోహణ, రాత్రి ఏడుకు సింహవాహన సేవను నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.



విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న మూలస్థానేశ్వరాలయం

శస్త్ర చికిత్సతో మూర్ఛను అరికట్టొచ్చు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (అర్బన్): శస్త్ర చికిత్స ద్వారా మూర్ఛ వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి విభాగాధిపతి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మూర్ఛ వ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఎంపీ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవగాహన సదస్సును నారాయణ ఆస్పత్రిలోని డాక్టర్ బీసీ రాయ్ లెక్చర్ గ్యాలరీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం ద్వారా ఆపరేషన్ చేసి మూర్ఛను పూర్తిస్థాయిలో నయం చేయొచ్చని చెప్పారు. తొలుత బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నారాయణ ఆస్పత్రి ఏజీఎం భాస్కర్‌రెడ్డి, పీఎంపీ నేతలు శేషయ్య, శ్రీనివాసులు, మోహన్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కారు దగ్ధం

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తులు చెత్తను తగలబెట్టడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న కారు పాక్షికంగా దెబ్బతినింది. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని కింగ్స్ కోర్టు అవెన్యూకు చెందిన సనత్‌కుమార్‌రెడ్డి టయోటా కంపెనీకి చెందిన కారును పది రోజుల క్రితం కొనుగోలు చేశారు. ఈ క్రమంలో తన కారును ప్రకృతి హోటల్ పక్కన నిలిపి సమీపంలోని కింగ్స్ కోర్టు గెస్ట్ ఇన్ హోటల్‌కు వెళ్లారు. బయటి నుంచి పెద్దగా కేకలేస్తుండటంతో ఆయన వచ్చి చూసేసరికి కారు ముందుభాగం కాలిపోతూ కనిపించింది. దీంతో పక్కన ఉన్న నీరు పోసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వాహనాన్ని నిలిపిన ప్రాంతంలో చెత్తను గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టడంతో కారు దెబ్బతినిందంటూ దర్గామిట్ట పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.